క్లుప్తంగా

యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక



యూటీఎఫ్ తాళ్లపూడి మండల నూతన కార్యవర్గం

తాళ్లపూడి: ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) తాళ్లపూడి మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం వేగేశ్వరపురం జడ్పీ స్కూల్లో ఎన్నుకున్నారు. మండలశాఖ అధ్యక్షుడిగా టి.క్రాంతికుమార్, ఉపాధ్యక్షుడిగా జంగా లక్ష్మీపతి, గౌరవాధ్యక్షురాలిగా ఎం.రాజకుమారి, మహిళా అధ్యక్షురాలిగా కె.కృష్ణవేణి, ప్రధాన కార్యదర్శిగా టి.నాగేశ్వరరావు, కోశాధికారిగా టి.వెంకటరమణ, కార్యవర్గ సభ్యులుగా కె. ప్రసన్నకుమార్, యుగంధర్, సాయిచంద్ర, సుమ, అబ్బులు, గణేష్, లక్ష్మయ్య, జిల్లా కౌన్సిల్‌గా టి.నాగేశ్వరరావు, క్రాంతికుమార్, ఎం. రవి, ఎం.రమేష్ , నాగేశ్వరరావు, రాజారావు, ఆడిట్ కమిటీ సభ్యుడిగా కె.రాంపండులను ఎన్నుకున్నారు. యూటీఎఫ్ నాయకులు ఎం.రాజు, బి.వి జయబాబు తదితరులు పాల్గొన్నారు.

మేధోసంపత్తి - హక్కులపై విద్యార్థులకు అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న టీపీఓ వీరరాఘవులు (చెన్నై)

నల్లజర్ల: జాతీయ మేధో సంపత్తి-హక్కులు అనే అంశంపై ప్రకాశరావుపాలెం వైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ఆదివారం అవగాహన కల్పించారు. సాంకేతికంగానే కాకుండా పారిశ్రామికంగానూ విద్యార్థులు అభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో ఈ సదస్సు నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ కె.అరవిందకుమార్ తెలిపారు. సదస్సుకు సమన్వయకర్తగా టీపీఓ కె.వీరరాఘవులు వ్యవహరించారు. కాపీరైట్స్, పేటెంట్స్, ట్రేడ్ మార్క్స్, ట్రేడ్ సీక్రెట్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీటెక్ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులతో పాటు ప్లేస్‌మెంట్ అధికారి డాక్టరు ఏఎస్ ప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

నేడు కొవ్వూరులో గడప గడపకూ..

కొవ్వూరు: రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత సోమవారం కొవ్వూరు పట్టణంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారు. టోల్‌గేట్ జంక్షన్ వద్ద, 15వ వార్డు శ్రీనివాసపురం కాలనీలోను మంత్రి పర్యటిస్తారు. ఉదయం తొమ్మిది గంటలకు రామాలయం వద్ద నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులందరూ హాజరు కావాలని 15వ వార్డు కౌన్సిలర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర కోరారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యంపై కేసు

కొవ్వూరు: మండలంలోని మద్దూరులంకకు చెందిన కర్రి కుమార్ అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. సుమారు15 ఏళ్లుగా తన భర్త కనిపించడం లేదంటూ అతడి భార్య కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్సై జి.సతీష్ తెలిపారు. మతిస్థిమితం లేని తన భర్తకు రాజమహేంద్రవరంలో వైద్యం చేయించేవారమని కుమారి తన ఫిర్యాదులో పేర్కొంది. అయితే 2008 జనవరి 18న ఎవరికీ చెప్పకుండా కుమార్ ఇంటి నుంచి ఎక్కడికో వెళ్లిపోయాడని ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి వెతుకుతున్నప్పటికీ ఆయన ఆచూకీ లభ్యం కాలేదని, తనకు తెలియక పోవడంతో ఇప్పటి వరకూ పోలీసులకు ఫిర్యాదు చేయలేదని పేర్కొంది. తాను పింఛను కోసం వెళ్లగా భర్త ఉన్నందున పింఛను రాదని చెప్పినట్టు కుమారి ఆ ఫిర్యాదులో పేర్కొంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కొవ్వూరు: స్థానిక టోల్ గేట్ జంక్షన్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజమహేంద్రవరం సమీపంలోని నామవరం గ్రామానికి చెందిన చెలం శివ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వారం క్రితం శివ కొవ్వూరు పట్టణంలోని హిందూ శ్మశానవాటికలో పనిచేస్తున్న తమ మేనమామ అయిన కత్తి చిన్న ఇంటికి వచ్చాడు. ఇరువురూ కలసి బైక్‌పై శనివారం రాత్రి రాజమహేంద్రవరం బయలుదేరారు. టోల్ గేట్ జంక్షన్ వద్ద వెనుక నుంచి వేగంగా వస్తున్న మరో మోటార్ సైకిల్ వారిని ఢీ కొట్టింది. దీంతో రోడ్డుపై పడిపోయిన శివ తలకు బలమైన గాయమైంది. దీనిపై చిన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ ఏఎల్ఎస్ రవికుమార్ తెలిపారు.

విద్యార్థి మృతదేహం లభ్యం

కొవ్వూరు: రోడ్డు కం రైలు వంతెనపై నుంచి ఈనెల 6న గోదావరి నదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు నాగిరెడ్డి వెంకట సాయికుమార్ (19) మృతదేహం ఆదివారం నదిలో లభ్యమైంది. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు కొవ్వూరు పట్టణ సీఐ ఏఎల్ఎస్ రవికుమార్ తెలిపారు. మృతుడు సాయికుమార్ కొవ్వూరు ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాల్లో డిగ్రీ సెకండియర్ చదువుతున్నారు. అతడి సొంతూరు పోలవరం మండలం కొత్త పట్టిసీమ.

గడప గడపకూ నిధులు.. పల్లెల్లో పనులు

- గోపాలపురం నియోజకవర్గానికి రూ.130 కోట్ల నిధులు
- చురుగ్గా సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం
- ఇప్పటికే 24 పనుల పూర్తి



దేవరపల్లి మండలం యర్నగూడెంలో నిర్మించిన సీసీ రోడ్డు



యర్నగూడెంలో గడపగడపకూ నిధులతో నిర్మించిన సీసీ డ్రెయిన్

దేవరపల్లి: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పల్లెలకు వరంగా మారింది. గ్రామాల్లోని దీర్ఘకాల సమస్యలు పరిష్కారం అవుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు గడప గడపకూ వెళ్లినప్పుడు ప్రజలు తన దృష్టికి తెచ్చిన ప్రధాన సమస్యలను నమోదు చేసుకుంటున్నారు. ప్రాధాన్యత క్రమంలో ఆ పనులకు అధికారులతో ప్రతిపాదనలు తయారు చేయించి ప్రభుత్వానికి సమర్పిస్తున్నారు. గడప గడపకూ కార్యక్రమంలో మంజూరైన నిధులతో గుర్తించిన పనులు చేపడుతున్నారు. ఇప్పటికే సిమెంట్ రోడ్లు, సిమెంట్ డ్రెయిన్లు, మంచినీటి పైప్‌లైన్ల నిర్మాణం, శ్మశానవాటికల అభివృద్ధి వంటి పనులు చేపట్టారు. ఒక్కో గ్రామ సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షల చొప్పున మంజూరు చేస్తోంది. ప్రధానంగా దళితవాడల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీల పనులు వేగంగా జరుగుతున్నాయి. నియోజకవర్గంలో 65 గ్రామ సచివాలయాల పరిధిలో పనులు చేపట్టారు. మరో 16 గ్రామ సచివాలయాలకు నిధులు మంజూరు కావలసి ఉంది.

రూ.4.68 కోట్లతో రోడ్లు, డ్రెయిన్లు

నియోజకవర్గంలోని మూడు మండలాల్లో గడప గడపకూ నిధులు రూ.4.68 కోట్ల వ్యయంతో సిమెంట్ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. మూడు మండలాల్లో 165 పనులు మంజూరగా, ఇప్పటికే వాటిలో 24 పనులు పూర్తయ్యాయి. 139 పనులు వివిధ దశల్లో జరుగుతున్నాయి. గడప గడపకూ నిధులకు జెడ్పీ, మండల పరిషత్, ఎమ్మెల్యే ప్రత్యేక నిధులను జోడించి అభివృద్ధి పనులు చేస్తున్నారు.

రూ.9 కోట్లతో అభివృద్ధి



గ్రామంలోని రెండు గ్రామ సచివాలయాలకు గడప గడపకూ నిధులు రూ.40 లక్షలు మంజూరు చేశారు. దళితవాడల్లో సిమెంట్ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, శ్మశాన వాటికలకు రోడ్లు వేశాం. రెండేళ్లలో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.9 కోట్లతో గ్రామంలో అభివృద్ధి పనులు చేశాం. అలాగే జెడ్పీ నిధులు రూ.3 కోట్లు మంజూరవగా గ్రామాన్ని అభివృద్ధి చేశాం. రూ.73 లక్షల వ్యయంతో డ్రెయిన్లు నిర్మించాం. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్, ఎంపీపీ కేవీకే దుర్గారావు సహకారంతో గ్రామం అభివృద్ధి పథంలో పయనిస్తోంది.

– బొంతా భరత్‌బాబు, సర్పంచ్, యర్నగూడెం

వేగంగా పనులు



దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం మండలాల్లో గడప గడపకూ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. సిమెంట్ రోడ్లు, సీసీ డ్రెయినేల నిర్మాణం జరుగుతున్నాయి. గడప గడపకూ నిధులు ప్రతి గ్రామ సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరవగా, ఎమ్మెల్యే ప్రత్యేక నిధులు, జెడ్పీ, ఎంపీపీ నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇప్పటి వరకూ రూ.69.50 లక్షల వ్యయంతో 24 పనులు పూర్తి చేశాం. మిగిలిన పనులు జరుగుతున్నాయి.

– కె. బాలకృష్ణ, డీఈఈ, పంచాయతీరాజ్, గోపాలపురం

దళితవాడల అభివృద్ధికి ప్రాధాన్యం



దళితవాడల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఇప్పటి వరకూ 72 సచివాలయాల్లో పూర్తిచేశాను. 65 గ్రామ సచివాలయాలకు రూ.130 కోట్లు మంజూరయ్యాయి. దళితవాడల్లో సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి పథకాలు, శ్మశానవాటికల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చి నిధులు మంజూరు చేశాం. అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదు. రూ. 5.01 కోట్ల వ్యయంతో డ్రెయిన్ల నిర్మాణం జరుగుతోంది.

– తలారి వెంకట్రావు, ఎమ్మెల్యే, గోపాలపురం

పందేలు ఆడి జీవితాలు నాశనం చేసుకోవద్దు

- గోపాలపురం ఎమ్మెల్యే వెంకట్రావు
- ద్వారకాతిరుమలలో వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: సంక్రాంతి పండగ పేరుతో జూదాలు ఆడి జీవితాలను నాశనం చేసుకోవద్దని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు యువతకు సూచించారు. సంప్రదాయ క్రీడలే ముద్దు.. జూదాలు వద్దు అంటూ ద్వారకాతిరుమల పోలీసులు స్థానిక శ్రీవారి దేవస్థానం పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ సంక్రాంతి పండగనాడు అందరూ తమ కుటుంబాలతో కలసి ఆనందంగా గడపాలన్నారు. పండగ పేరుతో యువతను సన్మార్గంలో పెట్టేందుకు సంప్రదాయ క్రీడా పోటీలు నిర్వహిస్తున్న పోలీసు శాఖను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఎస్సై టి.సుధీర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, సర్పంచ్ కుంటం స్వర్ణలత, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుతో ఆధార్ లింకేజీ 80.87 శాతం పూర్తి



కొవ్వూరు 95వ పోలింగ్ కేంద్రంలో ఆధార్ లింకేజీని పరిశీలిస్తున్న డీటీ కమల్ సుందర్

కొవ్వూరు: ఓటరు గుర్తింపు కార్డుతో ఆధార్ నంబర్ అనుసంధాన ప్రక్రియ కొవ్వూరు నియోజకవర్గంలో 80.87 శాతం పూర్తయ్యిందని డిప్యూటీ తహసీల్దార్ (ఎలక్షన్స్) ఎం.కమల్ సుందర్ తెలిపారు. ఆదివారం పోలింగ్ కేంద్రాల వద్ద నిర్వహించిన ప్రత్యేక శిబిరాల్లో 1,439 మంది ఆధార్ కార్డుల నంబర్లకు ఓటరు కార్డులతో అనుసంధానం చేసినట్టు ఆయన వివరించారు. మరో 837 మంది ఓటర్లు డిజిటల్ విధానంలో గరుడ యాప్ ద్వారా అనుసంధానం చేసుకున్నారన్నారు. నియోజకవర్గంలో 174 కేంద్రాల పరిధిలో మొత్తం 1,77,327 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకూ 1,43,412 మంది ఓటర్ల ఆధార్ అనుసంధాన ప్రక్రియ పూర్తి చేసినట్టు తెలిపారు. కొవ్వూరు పట్టణంలో 95 పోలింగ్ కేంద్రంలో ఆధార్ అనుసంధానం ప్రక్రియను పరిశీలించినట్టు ఆయన తెలిపారు.

కోడిపందేల బరులు ధ్వంసం



తెలికిచెర్లలో కోడి పందేల బరిని పొక్లెయిన్‌తో ధ్వంసం చేయిస్తున్న పోలీసులు

నల్లజర్ల: సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, పేకాట, కోతాట వంటివి నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని నల్లజర్ల సీఐ లక్ష్మణ్ రెడ్డి హెచ్చరించారు. కోడి పందేల నిర్వహణకు మండలంలోని తూర్పుచోడవరం,తెలికిచెర్ల గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న బరులను పొక్లెయిన్ సాయంతో పోలీసు సిబ్బంది ఆదివారం ధ్వంసం చేశారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఉండ్రాజవరం: సంక్రాంతి ముసుగులో పేకాట, కోతాట, కోడి పందేలు వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై కె.రామారావు హెచ్చరించారు. కోడి పందేలు, జూదాలు ఆడడం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ మండలంలోని వడ్లూరులో ప్రజలకు ఆదివారం పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కోడి పందేల బరులు తయారు చేయడం, కోడిపందేలు నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. లోగడ మండలంలో కోడి పందేలు, గుండాట, పేకాట కేసుల్లో నమోదైన 50 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహించే కబడ్డీ పోటీలను ఎస్సై ప్రారంభించారు. సర్పంచ్ రఘుమండ తేజశ్రీ , సొసైటీ అధ్యక్షుడు కఠారి సిద్ధార్థరాజు, ఎంపీటీసీ సభ్యురాలు వేండ్ర అనంతలక్ష్మి, పాలాటి శరత్‌బాబు, గంధం మునేశ్వరరావు, ఏఎస్సై ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆసరా లబ్ధిదారుల జాబితాలు సిద్ధం



ప్రకాశరావుపాలెం గ్రామ సచివాలయంలో ఆసరా లబ్ధిదారుల జాబితా ప్రదర్శిస్తున్న కార్యదర్శి లావణ్య

నల్లజర్ల: వైఎస్సార్ ఆసరా రుణమాఫీ మూడో విడత విడుదల చేసే ఆర్థిక సాయానికి ప్రభుత్వం లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేసింది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ వెరిఫికేషన్ పూర్తిచేసి లబ్ధిదారుల జాబితాలను సామాజిక తనిఖీల కోసం గ్రామ సచివాలయాల నోటీసు బోర్డుల్లో ఉంచారు. వాటిలో అభ్యంతరాలు ఉంటే తెలియజేసేందుకు అవకాశం ఇచ్చారు. మృతులు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, తప్ప 97 శాతం స్వయం సహాయక సంఘాలకు అర్హత ఉన్నట్టు చెబుతున్నారు. బృందాల వారీగా సభ్యుల నుంచి బయో మెట్రిక్ తీసుకున్నారు. బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసి సక్రమంగా ఉన్న వారి వివరాలు ఆన్‌లైన్ చేశారు. ఆసరా సాయాన్ని ఈ నెలలోనే అందించనున్నారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో కార్యాచరణ పూర్తయింది.

1621 సంఘాల్లో 16,260 మంది సభ్యులు

నల్లజర్ల మండలంలోని 1621 సంఘాల్లో 16,260 మంది సభ్యులున్నారు. వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా 2019 ఏప్రిల్11 నాటికి డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఆయన ప్రభుత్వం ఇప్పటికే రెండు విడతలుగా వారి ఖాతాలకు సొమ్మును జమ చేసింది.ఈ సంఘాల మొత్తం బకాయి రూ.61.77 కోట్లు. కాగా మూడో విడతలో రూ.15.37 కోట్లను సభ్యుల ఖాతాల్లో జమ చేయనున్నట్టు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం నాగేశ్వరరావు తెలిపారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు



ప్రసన్నకుమార్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందిస్తున్న ఘంటా మధుకృష్ణ

గోపాలపురం: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలం వేళ్లచింతలగూడెం రంగారావు, మధుకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మొత్తం 36 జట్లకుగానూ ఆదివారం నాటికి 30 జట్లకు పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. ఆదివారం నిర్వహించిన మ్యాచ్‌లో ప్రసన్న జట్టు జంగారెడ్డిగూడెం జై బాలయ్య జట్టుపై 46 పరుగుల తేడాతో విజయం సాధించింది. ప్రసన్నకుమార్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డును చైర్మన్ మధుకృష్ణ అందజేశారు. సోమవారం నుంచి రాష్ట్ర స్థాయి మహిళల, పురుషుల కబడ్డీ పోటీలు జరుగుతాయని కమిటీ సభ్యులు కొర్లపాటి రాము, పిన్నమనేని వెంకటరత్నం, కె. రాజా తెలిపారు.

శ్రీవారి అన్నదాన భవన కార్మికుల ఆందోళన

ద్వారకాతిరుమల: స్థానిక చినవెంకన్న నిత్యాన్నదాన భవనంలో పనిచేసే కొందరు కార్మికులు ఆదివారం ఆందోళన బాట పట్టారు. తమను అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించి, జీతభత్యాలు పెంచాలని కోరుతూ అన్నదాన భవనం వద్ద బైఠాయించి నినాదాలు చేశారు. నిత్యాన్నదాన భవనంలో పదేళ్ల క్రితం నుంచి 40 మంది కార్మికులు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఒక్కొక్కరూ నెలకు రూ.10 వేల జీతం అందుకుంటున్నారు. ఇటీవల అన్నదాన భవనంలో నూతనంగా నియమితులైన 20 మంది కార్మికులను అవుట్ సోర్సింగ్‌లో చేర్చి, ఒక్కొక్కరికి నెలకు రూ.18 వేల జీతం ఇస్తున్నారు. దాంతో పాత 40 మంది కార్మికులు ఒక్కసారిగా భగ్గుమన్నారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న తమను కాంట్రాక్ట్ ఉద్యోగులుగానే ఉంచి, కొత్తగా వచ్చిన వారిని అవుట్ సోర్సింగ్‌లో చేర్చి, వారికి నెలకు రూ.18 వేల జీతం ఇవ్వడం అన్యాయమని ధ్వజమెత్తారు. తమను కూడా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, జీత భత్యాలు పెంచాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఆందోళనకారులతో సంబంధిత కాంట్రాక్టర్ చర్చలు జరుపుతున్నారు. దీనిపై ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు వివరణ ఇస్తూ అన్నదాన భవన కార్మికుల ఆందోళన అంశం పూర్తిగా కాంట్రాక్టర్‌కు సంబంధించిందని అన్నారు. కార్మికులు, కాంట్రాక్టర్ ఇరువురు చర్చించుకుని సమస్యను పరిష్కరించుకోవాలన్నారు.

క్షయ వ్యాధి గుర్తింపు సర్వే తనిఖీ

చాగల్లు: క్షయ వ్యాధి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జిల్లా నోడల్ అధికారి ప్రొఫెసర్ సూర్య అన్నారు. మండలంలోని నెలటూరులో నిర్వహిస్తున్న సబ్ నేషనల్ సర్టిఫికేషన్ (ఎస్ఎన్ సీ)క్షేత్ర స్థాయి సర్వేను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వ్యాధి లక్షణాలు ఉన్న వారిని తప్పనిసరిగా గుర్తించాలని సూచించారు. వారందరికీ పరీక్షలు నిర్వహించి డాట్స్ విధానం ద్వారా ఉచితంగా మందులు అందిస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ బి.భాగ్యలక్ష్మి, ఎస్ఎల్‌టీఎల్ఎస్ భీమరాజు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగిన పడవ కార్మికుల నిరసన

- ఓపెన్ రీచ్‌ల వాహనాలు అడ్డగించి నిరసన
- సర్ది చెప్పిన ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ సోమశేఖర్



కుమారదేవం ఇసుక ర్యాంపు వద్ద నిరసన తెలుపుతున్న పడవ కార్మికులు

కొవ్వూరు: గోదావరి ఓపెన్ ఇసుక రీచ్‌ల వద్ద పడవ కార్మికుల ఆందోళన ఆదివారం రెండో రోజు కూడా కొనసాగింది. కుమారదేవం, బల్లిపాడు ఓపెన్ ఇసుక ర్యాంపుల వద్దకు పెద్ద ఎత్తున పడవ కార్మికులు, యాజమానులు చేరుకుని నిరసన తెలిపారు. ఓపెన్ రీచ్‌ల్లో మాదిరిగా పడవల ర్యాంపుల్లోను ఒకే ధర నిర్ణయించి తమకు ఉపాధి కల్పించాలని వారు కోరారు. ఓపెన్ రీచ్‌ల్లో టన్ను ఇసుకను రూ.475 విక్రయిస్తూ పడవల ర్యాంపుల్లో టన్ను ఇసుకను రూ.625 రేటుకు విక్రయించడం వల్ల తమ ర్యాంపుల్లోని ఇసుక అమ్ముడుపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం, తాళ్లపూడి, కొవ్వూరు మండలాల్లో సుమారు ఆరు వేల మంది కార్మికుల ఉపాధి దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. పడవ కార్మికులు, బోట్స్‌మెన్ సొసైటీ సభ్యులు, పడవల యజమానులతో పాటు వైస్సార్‌సీపీ స్థానిక నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఓపెన్ రీచ్‌ల్లోకి వచ్చే వాహనాలను అడ్డుకుని నిరసన తెలిపారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో (ఎస్ఈబీ) అడిషనల్ ఎస్పీ పి. సోమశేఖర్ కుమారదేవం రీచ్‌కు వచ్చి ఆందోళనకారులతో చర్చించారు. పడవ ర్యాంపుల నిర్వాహకులకు, కార్మికులకు ఏవైనా సమస్యలుంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. వాహనాలను అడ్డుకోవడం తగదన్నారు. ఇసుక ర్యాంపుల నిర్వహణా సంస్థ జిల్లా ఇన్‌చార్జ్ ప్రేమ్‌కుమార్, బోట్స్‌మెన్ సొసైటీల ప్రతినిధులు బర్ల శ్రీనివాస్, మారిన రామకృష్ణ, సుంకర కొండబాబు, పి.సత్యనారాయణ, జి.శ్రీని వాస్, మదన్‌మోహన్‌రెడ్డి, యడ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వడ్లూరులో నూతన వస్త్రాల పంపిణీ



వడ్లూరులో సచివాలయ సిబ్బందికి వస్త్రాలు అందజేస్తున్న సర్పంచ్ రఘుమండ తేజశ్రీ

ఉండ్రాజవరం: ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించడంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది కృషి మరువలేనిదని జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలో వడ్లూరు పంచాయతీ సర్పంచ్ రఘుమండ తేజశ్రీ ఆర్థిక సహకారంతో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య సిబ్బందితో పాటు గ్రామంలోని పలువురు పేదలకు ఆదివారం నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు భాస్కరరామయ్యతో పాటు సొసైటీ అధ్యక్షుడు కఠారి సిద్ధార్థరాజు, ఎంపీటీసీ సభ్యురాలు వేండ్ర అనంతలక్ష్మి, రఘుమండ శ్రీను, పాలాటి శరత్‌బాబు, ఐవీఎస్ రాజు, పంచాయతీ కార్యదర్శి భూపతి తదితరులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ వారికి రూ.లక్ష ఆదాయం

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ వారిని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు ఆదివారం దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం(శివ) ఆధ్వర్యంలో వాసుబాబుకు అమ్మవారి చిత్ర పటాన్ని అందించి సన్మానించారు. కోటసత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా రూ.95,912 ఆదాయం వచ్చినట్లు ఈఓ చెప్పారు.

ఉప్పరగూడెంలో వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురం: అవంతి ఫీడ్స్ ఫ్యాక్టరీ యాజమాన్యం గోపాలపురంలోని ఉప్పరగూడెంలో నిర్మించిన మంచినీటి ప్లాంట్‌ను ఆదివారం గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు. ఆ ప్రాంత వాసులకు సురక్షిత తాగునీటిని అందించాలనే సేవా భావంతో అవంతీ సంస్థ ఈ వాటర్ ప్లాంట్ నిర్మించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు అదనంగా ప్రైవేటు సంస్థలు కూడా ఇలా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం గోపాలపురం జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత గృహ ప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే కొత్త ఇంటిని ప్రారంభించారు. ఆయన వెంట ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, సొసైటీ చైర్మన్ కూసం రామమోహన్‌రెడ్డి, జూనియర్ కాలేజీ చైర్మన్ వెలగా శ్రీరామమూర్తి, నాయకులు ఉన్నారు.

ప్లాట్‌ఫాం రిక్షా కార్మికుల సంఘ కార్యవర్గం ఎంపిక

నిడదవోలు: ప్లాట్‌ఫాం రిక్షా కార్మికుల సంఘ నూతన కార్యవర్గాన్ని ఐఎఫ్‌టీయూ నాయకులు ఈమని గ్రీష్మకుమార్ అధ్యక్షతన ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా కోనేటి మల్లీశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా బంకపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శిగా అడబాల రమణ, సంయుక్త కార్యదర్శిగా చొక్కాకుల సత్యనారాయణ, కోశాధికారిగా లంకాడ గణపతిలతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

టెంట్ హౌస్ ఓనర్ల సంఘానికి..

నిడదవోలు, చాగల్లు మండల షామ్యానా ఓనర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా అంబటి కాశి ఈశ్వరుడు, ఉపాధ్యక్షుడిగా బండారు సత్యనారాయణ, కార్యదర్శిగా బైపే రాజశేఖర్, కోశాధికారిగా మానూరి శ్రీనివాసరావులను సభ్యులు ఎన్నుకున్నారు.

దొండపూడిలో వైద్యశిబిరం



దొండపూడిలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ హేమంత్‌కుమార్

గోపాలపురం: మండలంలోని దొండపూడి గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన ఈశ్వరి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని దొండపూడి సర్పంచ్ మల్లిపూడి అచ్చిబాబు, ఎంపీటీసీ సభ్యుడు మారాజు రాజేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు ప్రారంభించారు. సుమారు 450 మంది రోగులకు డాక్టర్ ఎం.హేమంత్‌కుమార్ పరీక్షలు చేశారు. వారిలో అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

రోడ్డు కం రైలు వంతెనపై ట్రాఫిక్ జామ్



కొవ్వూరులో రోడ్డు కం రైలు వంతెనపై నిలిచిపోయిన వాహనాలు

కొవ్వూరు: రోడ్డు కం రైలు వంతెనపై ఆదివారం మధ్యాహ్నం గంట సేపటికి పైగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ట్రక్ అడ్డు రావడంతో బ్రిడ్జి పొడవునా వందలాది వాహనాలు ఆగిపోయాయి. కొవ్వూరు పట్టణ పోలీసులు, రాజమహేంద్రవరం సిటీ పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.